## 103. రక్షణ కవచం

"స్వామీ! ఆధ్యాత్మిక జీవితంలోకి ప్రవేశించిన కొందరు ఉన్నత స్థితికి వెళుతూంటే, ఇంకొందరు పతనం చెందుతున్నారు. దేనికిలా జరుగుతోంది?" గోదావరి ఒడ్డున నడిచే ఓ శిష్యుడు తన గురువుని ప్రశ్నించాడు.

"నీ ప్రశ్నకి జవాబు చెప్తాను కాని ఈ కమండలాన్ని నీటిలో వదిలి ఏం జరుగుతుందో చూసి చెప్పు."

గురువు ఇచ్చిన కమండలాన్ని అందుకుని దాన్ని శిష్యుడు నీళ్ళల్లోకి వదిలాడు. నీళ్ళ మీద తేలుతూ అది అవతలి ఒడ్డుకి తేరుకుంది. శిష్యుడు జరిగింది చెప్పాక గురువు అతనికి ఇంకో కమండలాన్ని ఇచ్చి మళ్ళీ చెప్పాడు.

"దీన్ని కూడా నీళ్ళల్లోకి వదిలి ఏం జరిగిందో చెప్పు."

ఈ సారి శిష్యుడు వదిలిన కమండలానికి చిల్లులు వుండటంతో అది ఆవలి ఒడ్డుకి చేరకుండా మధ్యలోనే మునిగిపోయింది. ఆ సంగతి శిష్యుడు గురువుకి చెప్పాడు.

"కమండలానికి వున్న చిల్లులు మన ఇంద్రియాల్లాంటివి. నది సంసారం. నీరు విషయ వాసనాదులు. ఎవరైతే తమ ఇంద్రియాలన్నిటినీ దృఢంగా నిగ్రహిస్తారో వారు ఆధ్యాత్మికంగా అభివృద్ధిని సాధిస్తారు. ఎవరినైతే ఇంద్రియాలు స్వారీ చేస్తున్నాయో వారు ఆధ్యాత్మికంగా ముందుకి సాగకుండా మధ్యలో ఆ కమండలంలా మునిగిపోతారు." వివరించాడు గురువు.

"అర్థమైంది స్వామీ! ఆధ్యాత్మిక ప్రగతికి ఇంద్రియ నిగ్రహం రక్షణ కవచం లాంటిది అని అర్థమైంది." చెప్పాడు శిష్యుడు.

## 104. ప్రసాదం

ఓ రోజు ఓ గురువుగారికి కాకరకాయ తినాలనిపించింది. తన శిష్యుడికి ఆ సంగతి చెప్పాడాయన. వెంటనే శిష్యుడు తోటలోకి వెళ్ళి

నవనవలాడే కొన్ని కాకరకాయలని కోసి తెచ్చాడు. గురువు ఒకటి కొరుక్కుని తిని ఇంకోటి శిష్యుడి చేతిలో వుంచాడు.

శిష్యుడు దాన్ని కొరగ్గానే నోరంతా చేదు మయం అయిపోయింది. అయినా శిష్యుడు గురువు ఇచ్చిన కాకర కాయలన్నిటిని అభ్యంతరం చెప్పకుండా తిన్నాడు.

"ఉమ్మేస్తావనుకున్నాను. నీకవి చేదుగా లేవూ?" అడిగాడు గురువు.

"స్వామి! నిత్యం మీరు ఎంతో రుచికరమైన పదార్థాలని పెడుతున్నారు. ఈ ఒక్క రోజు చేదు కాకరకాయలని ఇస్తే ఎలా ఉమ్మగలను?" అడిగాడు శిష్యుడు.

"ఇదే సత్యాన్ని నువ్వు దేవుడి విషయంలో కూడా అన్వయించుకో. దేవుడిచ్చే సుఖాలని ఆనందంగా అనుభవిస్తాం కాని కష్టాలని ఇచ్చినప్పుడు ఆయన్ని నిందిస్తాం. కష్టాలని కూడా ఆయన ప్రసాదంలా భావించి స్వీకరించాలి." బోధించాడు గురువు.

## 105. సంస్కారాలు

ఓ రాజుగారికి ఓ సారి ఓ అనుమానం వచ్చింది. మనుషులంతా ఒక్కటే ఐనా ఓ సందర్భంలో ఒక్కలాగే ఎందుకు ప్రవర్తించరు? ఓ సందర్భంలో ఒకరికి కోపం వస్తే, ఇంకొకరికి నవ్వు వస్తుంది. మరొకరికి దుఃఖం వస్తే ఇంకొకరికి ఆనందం కలుగుతుంది. ఎందుకీ తేడా?

రాజధాని బయట వున్న సెలయేరు పారే ఓ అడవిలో వున్న కొండగుహలో తపస్సు చేసుకునే ఓ ఋషి దగ్గరకి వెళ్ళి తన అనుమానాన్ని తీర్చమని అడిగాడు. అందుకా ఋషి చిన్నగా నవ్వి జవాబు చెప్పాడు.

"చిన్న మైనం ముక్కని, మాంసం ముక్కని, కొద్ది తడి ఇసకని, గుప్పెడు బురదని, కొద్ది రంపం పొట్టుని తీసుకుని వాటిని నిప్పులో వేసి చూడు. అన్నీ ఒకే చోట వున్నా మైనం కరుగుతుంది. మాంసం రుచిగా